

అయ్యా!....అబ్బాయిగోరూ! '' అన్న పిలుపు గురుమూర్తికి వినబడలేదుకాబోలు – లోపల్నుంచి జవాబు రాలేదు. ''అమ్మాయిగోరూ!....అమ్మాయి గోరూ!'' ఈ సారి గట్టిగా పిలిచిన కేకలు విని, ఆఫీసు రూములో పేపరు చదువుకుంటున్న గురుమూర్తి ''శారదా! శారదా! వాకిట్లో ఎవరో పిలుస్తున్నట్లున్నారు చూడు! పార్టీలయితే లోపలికి రమ్మను!'' అన్నాడు ఆ రోజు కేసును గురించి రావలసిన పార్టీలకోసం ఎదురు చూస్తూ. గుమస్తా ఏదో పని మీద బైటికి వెళ్ళాడు–ఆఫీసు రూములో తను ఒక్కడే వున్నాడు. శారద లోపల్నుంచి, ''ఎవరూ?'' అనుకుంటూ వీధి గుమ్మంలోకి వచ్చి, ''నువ్వా కోటయ్యతాతా? కులాసాగా వున్నావా?'' అంటూండగా, గురుమూర్తి ''ఎవరే?'' అని లోపల్నుంచి కేకేశాడు.

''మన రిక్షా కోటయ్యతాతానూ, అతని కొడుకూ వచ్చారండీ!'' శారద అంటూండగానే ''నేనుండయ్యా'' అని వరండాలోకి వచ్చి, ''తమరితో మాట్లాడాలని వచ్చా నండబ్బాయి గోరూ'' కోటయ్య అనేసరికి, ''లోపలికిరండి!'' అన్న గురుమూర్తి పిలుపుకు తండ్రీ, కొడుకు లిద్దరూ ఆఫీసు రూములోకి వెళ్ళారు. ఆ వూళ్ళో కల్లా బాగా పేరు సంపాదించుకున్న వ్యక్తి వకీలు గురుమూర్తి–అతను కేసు పట్టాడంటే, అపజయ మంటూ వుండదని ప్రఖ్యాతి. గురుమూర్తి తన న్యాయవాది వృత్తిలోనే కాక, వ్యక్తిగతంగా కూడా మంచి పేరు గణించుకున్నాడు. కాస్త అభ్యుదయ భావాలు కలవాడనే చెప్పాలి. అంతస్తుకు గౌరవ మిచ్చే మనిషికాడు–కోటయ్యా, అతని కొడుకు లోపలికి రాగానే ఎదురుగా వున్న బెంచి చూపించి, ''కూర్చోండి ఆ బెంచీమీద!'' అన్నాడు. కోటయ్య బెంచిమీద కూర్చోడానికి సందేహించాడు. అది గమనించిన గురుమూర్తి ''ఫరవాలేదు కూర్చోండిద్దరూ!'' అన్నాడు.

అయినా కోటయ్య బెంచిమీద కూర్చోకుండా, కింద నేలమీదనే గురుమూర్తికి ఎదురుగా కూర్చు న్నాడు. కోటయ్య కొడుకు తిరపతి మాత్రం నుంచునే వున్నాడు. గురుమూర్తి ఏమీ అడక్కుండానే కోటయ్య ప్రారంభించాడు. ''అబ్బాయి గోరూ! ఇయ్యాల ఇది అటో ఇటో తేల్సెయ్యాలండీ!'' అన్న కోటయ్య మొహంలోని బాధ, కోపం, విసుగు, గురుమూర్తికి అర్థంకాక చూస్తూ వుండిపోయాడు– ''బాబూ! ఎంతో కష్టపడి తల్లిలేని బిడ్డడని చిన్నప్పటాల నుంచీ పెంచి, పెద్దోణ్ణి జేశాను. నా కున్న ఆ ఒక్క రిచ్చాబండీ

యీడికే యిచ్చానండీ. నా పూరికొంప గూడా యీడి పేర్నే రాసేశానుగెందా? నేనా ఉబ్బసం దగ్గోణ్ణి. ఎంత మంది ఎన్నిజెప్పినా, మందూ మాకూ తీసుకోకుండా, పైసా పైసా కాణ్ణుంచి కూడబెట్టి, ఈడికి పెళ్ళి జేశానండీ.'' అని గుక్కతిప్పుకోకుండా చెప్పి ఆయాస పడ్డాడు కోటయ్య--గురుమూర్తికి అసలు విషయం అర్థం కాక, "ఏఁవైంది కోటయ్యా?'' అడిగాడు---"ఏఁవైందంటారేందుండీ? ఇందాకటాల నుంచి మొత్తుకుంటూంటే?'' అన్నాడే గాని అసలు సంగతి చెప్పలేదన్న సంగతి కోటయ్య బుర్రలోకి రాలేదు--కొంచెం ఆగి, మళ్ళా చెప్పడం ప్రారంభించాడు కోటయ్య. "అబ్బాయిగోరూ! తఁవురు గొప్ప పీడరు గెందా? ఇంతకంటే ఎట్టా సెప్ప నుండీ? ఈడి కోసఁ వని నేను సీఁవు నెత్తురు దారబోసి, యింతోణ్ణి జేస్తే, ఈ యెదవ నా మీద చెయ్యి జేసుకుని నన్ను కొడ్తాట్టండీ?'' అని ఆయాసపడ్తూ మళ్ళా "ఇదంతా నా తల్రాత ఈ పెపంచంలో యాడైనా వుండాడా మీరే జెప్పండి?'' అనేసరికి అంత సేపట్నుంచీ నోరు యిప్పకుండా అన్నీ వింటున్న తిరపతి, "అయ్యా! పీడరుగారూ! ఈడు ఒకటోరకం కేడీ అండీ!'' అన్నాడు కోపం పట్టలేక.

జన్మ యిచ్చిన తండ్రిని పట్టుకుని, 'వీడు,' 'వాడు,' 'కేడీ,' అని తిడుతున్న కొడుకుని చూసి గురుమూర్తికి కోపం వచ్చింది. రెండు పార్టీలను అడిగి అసలు విషయం తెలుసుకోందే తను ఏం న్యాయం చెప్పగలడు? "తిరపతీ! కన్నతండ్రిని పట్టుకుని ఇటువంటి మాటలు అనడానికి నీకు నోరెలా వచ్చింది? తల్లి, తండ్రి దైవం అన్నారు.'' అని, "అయితే, మీ నాన్నను యెందుకు కొట్టాల్సొచ్చింది?'' గురుమూర్తి మరో ప్రశ్న వేయకముందే తిరపతి "కొడ్తానా? నరుకుతానా? ఈడు తండ్రిగాదండీ! సైతాను. డబ్బుకాశపడి, నామెడకో గుదిబండని అంటగట్టాడు. దానికి సుట్టకాల్పటం అలవాటండీ!

# కక్షా? అపేక్షా?

## కొప్పరపు సరోజిని

ఇయ్యాల పొద్దున్న దాందగ్గిర సుట్ట లయిపోయి నాయిగాఁవోసు, మా అయ్య పెట్టిలోంచి సుట్ట తీయబోయిందంట--అంతలో యీయనగారెల్లి దాని చెయ్యి పట్టుకుని లాగిండంట! ఆ లాగటంలో దానికి దెబ్బ తగిలిందంట--దానికది గుండెలు బాదుకుని ఏడవటం మొదలెట్టింది. మరి అంత జరిగితే కొట్టానంటె కొట్టనాంట?'' అని తండ్రివైపు కొరకొరగ చూశాడు.

వెంటనే కోటయ్య అందుకున్నాడు. "నాపెట్టె లోంచి సుట్టలు తీత్తే నేనూరుకుంటానట్రా?.... అక్కడికీ ఎన్నోసార్లు చూసి వూరుకున్నా--ఎందుకని? అందుకని చెయి పట్టుకు లాగినంత మాత్రానికి గుండెలు బాదుకుని ఏడవాల్నా?'' అని గురుమూర్తితో, "అబ్బాయిగోరూ! మేం పేదోళ్ళం-ఏదో కాస్త సుట్టముక్కకి అలవాటు పడ్డ పాణాలు....పడ్డాక నా సుట్టముక్క కాజెయ్యకపోతే, దానికీ అలవాటేగా? కొనుక్కుని సావ రాదంట? నాకుమాత్రం డబ్బులు యాణ్ణుంచి వస్తాయి జెప్పండి--మీ అసు వంటోళ్ళకాడ, అయ్యా! బాబూ! అని సుట్ట ముక్కకి డబ్బులడుక్కుని తెచ్చుకుంటానుండీ. సమయానికి ఆ చుట్ట ముక్క లేకపోతే నాకు మా పిచ్చెక్కుద్దండీ! ఎంతకాలఁ వని యిట్టా వూరుకునేది? అందుకని సెయి పట్టుకుని అవతలకి అట్టా నెట్టా అంతే నుండీ! దెబ్బచిన్నదైనా ఏడుపు పెద్దదండీ.... సరే! ఇయన్నీ ఆట్టా వుంచండి--ఇగ పొద్దు గూకులు, 'ఈ దగ్గోడితో సత్తన్నాం--ఈడికి సావన్నా రాదు' అని ఇరుగు పొరుగోళ్ళతో కూస్తా వుంటుందండి! అయన్నీ కూడా ఓదార్చాను....ఎంత కని సెప్పం డబ్బాయిగోరూ'' అని...ఇక పట్టలేక, కొడుకుతో." నా కంటె నిన్నగాక మొన్నొచ్చిన పెళ్ళాం నీ కెక్కువైందంట్రా? ముడనట్టపోడా! నా ఉబ్బసానికి మందు కూడా తినకుఁడా, ఆడా, యీడా శాకిరీజేసి, పొట్టగట్టుకుని, డబ్బు కూడబెట్టి నీకు పెళ్ళిజేసినందుకంట్రా పెళ్ళాం యింత తీపైంది? నీకు పెల్లే జెయ్యకుంటే, ఈ పెళ్ళాం యాణ్ణుంచొచ్చేదిరా యదవా? కాత్తో కూత్తో మిగిలిన డబ్బు కూడా నీ యెదాన్నే పెట్టాను గెందరా యిశ్వాసగాతకుడా! ఇయ్యాల నీకీ పెల్లాఁవే పెపంచవైందటరా సచ్చినోడా?'' అని కోటయ్య ఆయాసపడుతూండగానే బయటనుంచి ఒక ఆడ కంఠ స్వరం వినిపించింది. ఆ స్వరం వింటూనే గురుమూర్తి కుర్చీలోంచి లేచి. గది గుమ్మం ముందు నుంచున్న ఒక స్త్రీ రూపాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు--చీర గోచీ బిగించి పైకి కట్టింది. జుట్టంతా రేగి వుంది. చీర నిండా నల్లగా అక్కడక్కడ మసి పూసినట్టుంది. మొహఁవంతా దుమ్ము కొట్టుకుని వుంది. నోట్లో చుట్ట. (నిప్పున్న వైపు నోట్లో పెట్టింది.) కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి. గురుమూర్తికి నోటమాట రాక అలాగే ఆమెను చూస్తూ నిలబడి పోయాడు.

కాకుంటే మరేంటి చెప్పండి? నా రాతే బాగుంటే నా యింటిదే బతికుండే దుండీ! ఇయ్యన్నీ సూడకుండా తప్పించు కెల్లిపోయింది-'' అని రొప్పుతూ, మొహానికి పట్టిన చెఁవటని పై పంచతో తుడుచుకున్నాడు. తిరపతి నోరు విప్పకుండా నుంచుని వున్నాడు. గురుమూర్తికి అప్పటికి కొంత అర్థమైంది. కాని కొడుకు కోటయ్యను యెందుకు కొట్టాడో తెలియలేదు. "అయితే కోటయ్యా! తిరపతి నిన్ను కొట్టాడా! ఎందుక్కొట్టాడు?'' అడిగాడు గురుమూర్తి. ఆ మాట వినిపించుకోకుండా కోటయ్య "బాబూ! తఁవసు వంటి పెద్ద మణ్సుల దగ్గిర చాకరీ జేసి సంటోణ్ణి యింతోణ్ణి జేశాను కాదుండీ! అదే నే జేసిన తప్పు. ఇప్పుడు పెద్దోడయ్యాడు -- అందుకని నాకీ సిచ్చేశాడు. ఇంతకంటే దుర్మార్గుడైన కొడుకు

తిరపతి ఆ వచ్చిన స్త్రీని గురుమూర్తికి పరిచయం చేశాడు. "ఇది మా యింటి ఆడదండి!" అని--గురుమూర్తికి ఎందుకనో తిరపతి మీద జాలి కలిగింది. 'అయ్యో పాపం!' అని--'అయినా వీడి తప్పేఁవుంది? ఇటువంటి ఆడది ఎంతకైనా తగును.' అనిపించింది--కోటయ్య వంక చూశాడు. కోటయ్యలో వచ్చినప్పుడున్నంత

రోషం, క్రోధం రెండూ దిగజారి పోయాయి. గురుమూర్తితో యింకా ఏదో చెప్పాలనుకున్న కోటయ్యను దగ్గు ఊపిరాడనీలేదు. గొంతులోంచి మాట పెగల్లేదు. ఏ మనిషిని గురించి అంతసేపూ చెప్పుకొచ్చాడో ఆ మనిషిని చూడగానే కోటయ్య భయపడిపోవడం గురుమూర్తి గమనించక పోలేదు. చాలా ఆశ్చర్యం వేసింది — అంతలో కోర్టుకు టైమవడం వల్ల "కోటయ్యా! ఇంకో రోజున రా! ఇప్పుడు కోర్టుకు టైమైపోయింది. ఇవ్వాళ ముఖ్యమైన కేసొకటుంది." అనేసి గురుమూర్తి లోపలికి వెళ్ళిపోయాడు.

గురుమూర్తి కారు స్టార్టుచేసి బైలుదేరాడు. కారు ముందుకు నడుస్తూంటే, తన చిన్నతనం వెనక్కి లాగింది గురుమూర్తిని. తను స్కూలు ఫైనలు చదివే రోజులవి. అప్పటికి తల్లి చనిపోయి రెండు సంవత్సరాలైంది-తండ్రి రాఘవరావుగారు, ఒక్కగానొక్క బిడ్డ భవిష్యత్తు కోసంవని రెండో వివాహం చేసుకోలేదు. గురుమూర్తికి చిన్న వయసవడాన్న, ఎవరితో స్నేహం చెయ్యొచ్చో, ఎవరితో చెయ్యగూడదో తెలిసేదికాదు. మానవ జీవితాన్ని, మంచికీ, చెడుకీ మలుపులు మళ్ళించే వయసది. చదువుమీద శ్రద్ధ తగ్గడం, సినిమాలు చూడడంవంటే ఆసక్తి పెరగడం మొదలైనవన్నీ రాఘవరావుగారు గమనించి తనను మందలించడం తనకు నచ్చేదికాదు. ఎప్పుడైనా తండ్రి కోప్పడితే, తను ఎంతో విసుక్కునేవాడు—దేనికీ తనకి స్వతంత్రం లేదనీ, అంత ఆస్తిపరుల బిడ్డయి నందుకు తన యిష్టం వచ్చినట్టు డబ్బు ఖర్చు పెట్టుకోడానికి వీలు లేకపోయిందనీ ఎంతో బాధ పడేవాడు, తల్లి లేకపోవడం ఒక్కగానొక్క సంతానమని తండ్రి తనను ఎంత జాగ్రత్తగా పెంచి పెద్దవాణ్ణి చేశాడో గురుమూర్తికి జ్ఞాపకం వుంది. తాను చెడు సావాసాలకుగాని, చెడు అలవాట్లకుగాని గురికాకుండా వుండాలని రాఘవరావుగారు వెయ్యి కళ్ళతో కాపాడేవారు. తను శ్రద్ధగా చదివి వృద్ధిలోకి రావాలని తండ్రి కోరిక. తనకి మెడిసన్ చదవాలని వుండేది. కాని, తండ్రికి మాత్రం తన కొడుకు 'లా' చదివి తనలాగ మంచిపేరు గణించుకోవాలని ఆశపడేవారు. తను మెడిసన్ చదువుతానని మూర్ఖంగా పట్టు పట్టేవాడు. అయితే తండ్రి తనకు ఎంతో నచ్చ చెప్పేవాడు. ఎంతో ఖరీదుగల లా పుస్తకాలు అయిదు బీరువాలకు పైన వున్నాయి. అవన్నీ ఏంవయ్యేటట్టు? రాఘవరావుగారికి న్యాయవాది వృత్తిమీద ఆసక్తి మెండు. ఆ విషయంలో తండ్రి కొడుకులకు తర్జనభర్జనలు జరిగాయికూడా. తండ్రి ఎప్పుడైనా కోప్పడితే అలిగి అన్నం తినేవాడు కాదు గురుమూర్తి. కొడుకు అన్నం తినలేదని తెలిస్తే వంటమనిషికి చెప్పి అన్నం పెట్టించి కొడుకు తినేవరకూ వంటగది ముందు కాపలా కాసేవాడు. కొడుకు ఏది తినాలని కోరితే అది అప్పటికప్పుడు వంటమనిషికి చెప్పి చేయించి పెట్టించేవారు. ఒకరోజున గురుమూర్తి దగ్గర సిగరెట్టు వాసన వచ్చింది—రాఘవరావుగారికి పట్టరాని కోపంవచ్చి ఈ చెంపా ఆ చెంపా వాయించి, "ఇప్పటినుంచీ నీకు సిగరెట్టు అలవాటైందన్న మాట! ఎంత కాలంనుంచిరా యిది?" అని.... "నువ్వు పెద్దవాడవై, ఉద్యోగం చేసి డబ్బు సంపాయిస్తూ, అంతస్తూ, హోదా పెరిగాక నీ యిష్టం వచ్చిన అలవాటు చేసుకో! వాటికింకా చాలా టైముంది....అప్పటికి నేనివన్నీ చూడబోతానా ఏంవన్నానా?" అని మందలించారు. ఆ మందలింపుకు గురుమూర్తికి రోషంవచ్చి నాలుగు రోజులు తండ్రితో మాట్లాడలేదు. అది వంటమనిషి రామ్మూర్తి గమనించి, గురుమూర్తికి నచ్చ చెప్పాలని, "బాబూ! నాన్నగారి మనసు నీకు తెలియదు-వారు ఏంకోప్పడినా నీ మంచికే—నీ కోసం వారెంతో త్యాగం చేస్తున్నారు. వారు నీ కోసం పడే బాధ నాకు తెలుసు బాబూ! నువు స్కూలునుంచి రావడం కాస్త ఆలస్యమైతే చాలు ఆయనెంతో కంగారు పడిపోతారు. 'వాడికేం కావాలో నువ్వే కనుక్కుంటూ వుండు రామ్మూర్తీ. వాడొట్టి పిచ్చి సన్నాసి—తల్లిలేని బిడ్డ—వాడికేలోటూ రాకూడదు' అని నాతో ఎన్నోసార్లు అన్నారు. 'నే నున్నన్నాళ్లూ ఫరవాలేదు. నేను పోయాక వాడి నెవరు చూస్తారు?' అని కంట తడిపెట్టేవారు. 'వాడొట్టి అమాయకుడు. వాణ్ణి ఎంతో ప్రేమగా చూసుకునే భార్య రావాలి. అప్పుడే నాకు తృప్తి' అని బెంగపడేవారు బాబూ! తాత్కాలికంగా నీకు నాన్నగారి మీద కోపం వచ్చినా, అలిగినా ఆయనకు నీ మీద వున్న ప్రేమ, బాధ్యత, బంధం ఇతరులకు ఎందుకుంటుంది బాబూ! రక్త సంబంధాన్ని మించిన బంధం లేదు బాబూ!" అని వంట మనిషి తనకు బోధించిన వన్నీ కళ్ళముందు మెదిలాయి. తనకు తెలియకుండానే స్టీరింగు మీదున్న తన చేతుల మీద కంటి బాష్పాలు రాలాయి. తండ్రి తన మీద చూపిన శ్రద్ధాసక్తులే తనని యిప్పుడు ఇంతవాణ్ణి చెయగలిగాయి అని తండ్రిని అనేక విధాల స్తుతించుకుంటూ కోర్టుకు చేరాడు.

*

గురుమూర్తి తన లా పూర్తవగానే, తండ్రి దగ్గరే జూనియరుగా వున్నాడు. గురుమూర్తి కొద్దికాలంలోనే మంచిపేరు, అనుభవం సంపాదించాడు. ఇక ఫరవాలేదనుకుని రాఘవరావుగారు గురుమూర్తికి బి.ఏ పాసైన చక్కని శారద నిచ్చి వివాహంచేశారు. తండ్రీకొడుకు లిద్దరూ కోటయ్య రిక్షాలోనే కోర్టుకు వెళ్ళేవారు. కొద్ది కాలం తరువాత కోటయ్యకు ఉస్తీచేసి ఆరోగ్యం సరిగాలేకపోయింది. రిక్షా తొక్కడం కష్టంగా వుండేది కోటయ్యకు — అయినా కొడుకుకోసం కారు కొనాలని రాఘవరావుగారికి ఎంతకాలంగానో కోరికగావుండేది—కారు కొన్నారు—కొడుకు కారు డ్రైవ్ చేస్తూ, తాను పక్కన కూర్చొని కోర్టుకు వెళుతూవుంటే రాఘవరావుగారు పొందేఆనందం, తృప్తి ఇంతంతకాదు....ఆయనకు యింకొక కోరిక కూడా వుండేది. తన కొడుకును ప్రేమగా చూసుకునే కోడలు రావాలనుకునేవారు—అలాగే శారద వచ్చింది. ఆమెలో శాంతస్వభావం, విద్య, అణుకువ అన్నీవున్నాయి. అలాంటి కోడల్ని చూసుకుని, 'తాము అదృష్టవంతులమే' అని పదేపదే అనుకునేవారు రాఘవరావుగారు. గురుమూర్తిని చిన్నప్పట్నుంచీ ఎత్తుకుతిరిగేవాడు కోటయ్య—తండ్రిని కోర్టుకు, కొడుకును స్కూలుకు తన రిక్షాలోనే తీసుకువెళ్ళేవాడు. ఆ చనువుకొద్దీ గురుమూర్తిని 'అబ్బాయిగోరూ!' అని పిలిచేవాడు—శారదవచ్చాక శారదను 'అమ్మాయిగోరూ!' అని పిలిచేవాడు. శారద అత్తవారింటికి వచ్చి నప్పటినుంచీ కోటయ్యను 'కోటయ్యతాతా!' అని పిలిచేది. కోటయ్యకు వారింట్లో చనువు ఎక్కువగానే వుండేది.

గురుమూర్తికి వివాహమైన నాలుగు సంవత్సరాలకు రాఘవరావుగారు కాలంచేశారు. రాఘవరావుగారు తనకి తన తండ్రి యిచ్చిన ఆస్తికాక తానుకూడా చాలా ఆస్తి సంపాదించారు. విద్య, ఐశ్వర్యం, బి.ఏ చదివిన అందమైనభార్య అన్నీ కలిగిన గురుమూర్తికి సంతానం లేకపోవడం పెద్ద లోపమనే చెప్పాలి. రాఘవరావుగారికి తను బతికుండగానే గురుమూర్తి కడుపున ఒక కాయ కాస్తే కళ్ళారాచూసి ఆనందించాలని ఎంతగానో కోరిక వుండేది. అయితే భగవంతుని నిర్ణయాన్ని ఎవరు మార్చగలరు? ఆ కోరిక తీరకుండానే

రాఘవరావుగారు వెళ్ళిపోయారు. తన తండ్రికి తనొక్కడే సంతానం. తనకదీ లేకపోయిందనే బాధ గురుమూర్తికి లేకపోలేదు. అయితే తన బాధను భార్యకు తెలియనిచ్చేవాడుకాదు. అదే విధంగా శారదకు కూడా. పెళ్ళయి నాలుగు సంవత్సరాలైనా తనకి సంతానం కలగలేదనేచింత వుండేది. కాని ఆ చింతను భర్తకు కనబర్చేది కాదు. ఆ విధంగా ఎవరికివారే లేనిఆనందాన్ని సృష్టించుకుని సంతోషంగా కాలంగడిపేవారు. ఒక్కొక్కప్పుడు శారదకు అనిపించేది, "బిడ్డలు లేరని బాధపడతాంవేగాని, కొంతమంది తమ బిడ్డలతో పడేబాధ చూస్తూవుంటే, అబ్బ! ఎందు కొచ్చిన సంతానంలెద్దురూ" అని. కాని మళ్ళా ఆమెకే అనిపించేది. "సంతానం వుండి పడే బాధకన్నా లేకపోవడంవల్ల కలిగేబాధ మరీ భరించరానిద"ని.

కాలాన్నిబట్టీ భగవంతుడిలో కూడా మార్పు కలిగింది. రాఘవరావుగారు పోయిన సంత్సరానికి తిరిగి ఆయనే శారద కడుపున జన్మించారు. పుత్ర సంతానం కలిగినందుకు శారదాగురుమూర్తుల ఆనందానికి అవధులు లేవు--కొడుక్కి తన తండ్రి పేరు పెట్టుకున్నాడు గురుమూర్తి. 'భగవంతుడికి దయ వచ్చినా పట్టలేం—కోపం వచ్చినా పట్టలేం—' అన్నట్టుగా కొడుక్కి రెండేళ్ళు వచ్చేసరికి శారదకు కూతురు కలిగింది!

*

ముసలి కోటయ్య యింట్లో యుద్ధం ముగిశాక తనకున్న పూరికొంప కూడా రిక్షాతోపాటు కొడుక్కి అప్పచెప్పి కొంతకాలంగా కోటయ్య గురుమూర్తి యింట్లో వుంటున్నాడు. అదంతా శారద చేసిన ఏర్పాటు—ఎంతైనా ప్లీడరు భార్యకదా. గురుమూర్తి యింటి పెరటి వైపు చిన్న పాక వేయించి కోటయ్యను వుండమంది శారద—ఏవో బజారు పన్లూ, చెట్లకు నీళ్ళుపొయ్యడం, కారు తుడవడం, అప్పుడప్పుడు పిల్లల్ని చూడడం, మొదలైన పనులు చేసుకుంటూ, ఇంత ముద్దతిని పడుంటు న్నాడు. నెలకు పది రూపాయల చొప్పున జీతం ఏర్పాటు చేసి కోటయ్యకు చుట్ట ఖర్చులకు యిచ్చే వాడు గురుమూర్తి.

కోటయ్య కొడుకును, కోడల్ని వదిలి దిగుల్లే కుండా గురుమూర్తి యింట్లో యింత తిని కాలం గడుపుతున్నాడు. ఒకనాడు గురుమూర్తి కోటయ్యను అడిగాడు.

"ఏం కోటయ్యా! ఇప్పుడు దిగుల్లేకుండా హాయిగా వుంటున్నావా?" కోటయ్య దిగులుతో కూడిన చిన్న నవ్వు నవ్వి, "ఆఁ మీ దయవల్ల వుంటున్నా నబ్బాయి గోరూ! ఈ జానెడు పొట్ట కోసం దిగులెందుకు బాబూ? .... కాని" ఆగి పోయాడు.

"ఏఁవిటి? కాని అని వూరుకున్నావేం!" అడిగాడు గురుమూర్తి — కోటయ్య ముందు కొంచెం సంకోచించి, తరువాత, "అబ్బాయి గోరూ! మీరు లచ్చ చెప్పండి—ఎయ్యి చెప్పండి! ఆడు నా కొడుకేగెందా? తల్లిలేని బిడ్డడని కట్ట పడి పెంచి పెద్దోణ్ణి జేసి పెల్లి జేశానాండీ?.... మతి కొచ్చినప్పుడల్లా గుబులుగానే వుంటాది బాబూ!" కోటయ్య కళ్ళు చెమ్మగిల్లాయి. అది గమనించిన గురుమూర్తికి ముసలాడి హృదయం అర్థంఁవైది, ఎంత పోట్లాడుకున్నా అతని రక్తాన్ని పంచుకు పుట్టిన కొడుకు—కడుపు తీపి అలాంటిది. ఈ సంబంధాన్ని తెంచడం ఎవరితరం? గురుమూర్తి నిశ్శబ్దంగా వుండడం గమనించిన కోటయ్య తన బాధను పసి కట్టాడనుకుని మాట మార్చాడు...."అది వయసులో నేను మట్టుకు తక్కువేం తిన్నా నబ్బాయిగోరూ? ఆ వయసులో ఆడి కంటే బలంగా వస్తాదులాగ వుండేవోణ్ణి!" అన్నాడు కోటయ్య గర్వంగా....

"అయితే కోటయ్యా! నువ్వూ కొడుతూండే వాడివా?" అని అడిగాడు గురుమూర్తి.

"కొట్టడమా!....అయితే అబ్బాయి గోరూ అప్పుడు కూడా నేను యిట్టాగే ముసలాడిగానే వుండానను కుంటుండారా? బలే! ఇట్టాగట్టాగ కొట్టే వాడినా...."

"అయితే, తిరుపతి నిన్ను కొట్టాడంటే అందులో తప్పేం వుంది? కొట్టాడంతేగా?" అన్న గురుమూర్తి మాటలకు కోటయ్యకు అభిమానం వేసింది. పై పంచ ఒక్కసారి దులిపి, "ఈ సారి నా వంటిమీద చెయ్యేసి సూడమనండి తెలుసుద్ది" పై పంచ మళ్ళా బుజాన్న వేసు కున్నాడు. కోటయ్య పైకి డాబులు పలుకుతున్నా డనీ, ఆ స్థితిలో అతనేఁవీ చెయ్య లేడనీ, గురుమూర్తికి బాగా తెలుసు—అయినా ఆ స్థితిలో ఏం చెప్పినా వినేట్టుగా లేడు కోటయ్య....

*

ఆదివారం వచ్చిందంటే, పండగలాగ వుంటుంది—అందరికి. ఆ రోజు పొద్దెక్కిలేవడం,

## సెనెసెన్సుకి స్వాగతం

కౌతూహలంతో విప్పారి
వెలుగులు జల్లే నీ కళ్ళలో
ఎందుకీ వింత నీడలు
ఊడలల్లుకుంటున్నాయి?

ఆరోగ్యం ఉట్టిపడీ
మెరిసే నీ చర్మం ముడతలు
మచ్చలుగా ఎందుకిలా మాసింది?

ఎత్తులకి ఎగసి నిప్పురవ్వలు
కురిసిన చిచ్చు బుడ్డి విచారంగా
కుమిలిపోతోంది

ఆయాసంగా రొప్పుతూ
బస్సు వెనక పరిగెత్తే
లావుపాటి పక్కింటి పిన్నిగారిలా
కాలం వెనక చూపులు చూస్తూ పారిపోతోంది.

అడుగేసిన అగాధంలోకి
హాహాకారాలు చేస్తూ
స్లో మోషన్‌లో కూలిపోతున్నాను.

వారం రోజుల క్రితం గడియారం
ఆగిపోయుంటే,
నా కళ్ళూ మెరుస్తాయి

—లలిత

సెనెసెన్సు అంటే – వృద్ధాప్యం

మధ్యాన్నాలు కూడా బాగా నిద్రపోవడం, సాయంత్రాలు ఏ స్నేహితుల యిళ్ళకైనా తాము వెళ్ళడమో, వారు తమ యిళ్ళకు రావడమో, జరగడం సహజం. సినిమా చూడ్డం అంటే ఆసక్తిగలవాళ్ళు ఆదివారాన్ని పూరికేపోనీయరు. భార్యాపిల్లల్ని తీసుకుని సినిమాలకు కూడా వెళ్ళడం జరుగుతుంది. అయితే గురుమూర్తి యివన్నీ పాటించకపోయినా, ఆదివారం వస్తే పొద్దున్న ఆలస్యంగా లేవడం, మధ్యాన్నాలు బాగా నిద్రపోవడం ఆదివారాల కార్యక్రమాల్లో ముఖ్యమైన అంశాలు. పిల్లల్ని సాయంత్రాలు ఎక్కడికైనా తీసుకెళ్ళాలంటే శారదే కారు డ్రైవు చేసుకుంటూ పిల్లల్ని తీసుకెళ్తుంది.


ఆ రోజు ఆదివారం – మామూలుగా పొద్దెక్కి లేవవచ్చని పొద్దున్న ఎనిమిది గంటలైనా లేవలేదు గురుమూర్తి–మంచి నిద్రలో వున్న సమయంలో శారద హడావిడిగా వచ్చి లేపడంతో హఠాత్తుగా కళ్ళు తెరచాడు గురుమూర్తి – ఎదురుగా తన శ్రీమతి గాభరాగా నిలబడి వుంది. "ఏఁవిటి శారదా ?"

"తొందరగా లేవండి! కోటయ్య తాతకేదో కొంప మునిగినట్టుంది. ఏడుస్తూ వచ్చాడు." అంటూ భర్తను చేయి పట్టుకుని లేపి కూర్చోబెట్టింది శారద. గురుమూర్తికి నిద్రమత్తు వదలలేదు. మళ్ళీ పడుకుని, "నే నిప్పుడు లేవలేను – నేను లేవనన్నానని మీ కోటయ్య తాతతో చెప్పు!" అని తలకింద దిండు తీసి మొహాన్ని కప్పుకుని మళ్ళీ పడుకున్నాడు. "మీరు త్వరగా లేచి రావాలండీ! కోటయ్యా తాత గుండెలు బాదుకుని ఏడుస్తున్నాడు. తర్వాత ఏం జరుగుతుందో భయంగా వుంది." అని భర్తను తొందర పెట్టింది శారద. భార్య ఆత్రుతనీ, గాభరానీ, చూడలేక తప్పనిసరిగా తన బద్ధకశ్రీని విమానం ఎక్కించి కళ్ళు నలుపుకుంటూ బైటికొచ్చాడు. గురుమూర్తిని చూడగానే కోటయ్య నెత్తీ నోరూ బాదుకుని ఏడుస్తూ, "అబ్బాయిగోరూ! నా బిడ్డని బతికించండయ్యా! ఆడు సచ్చిపోతుండాడు. రక్షించండి బాబూ!" అని గురుమూర్తి రెండు కాళ్ళు పట్టుకున్నాడు. గురుమూరికి ఏమీ అర్థం కాలేదు. కోటయ్యను లేవదీసి, "ఏమైంది కోటయ్యా? నీ కొడుక్కి ఏ వొచ్చింది? ఏడవకుండా జరిగిందేదో చెప్పు!" అని అడిగాడు గురుమూర్తి.

"నాతో రాండి సూద్దురు గాని!" అని గురుమూర్తిని పక్క వీధిలో ఒక సందులోకి తీసుకు వెళ్ళాడు కోటయ్య. ఒక పూరిపాక ముందు నుంచి సందు చివరదాకా జనం పోగైవున్నారు.

"అయ్యో దేవుడా!" అని కేకలు దూరాన్నుంచి వినిపిస్తున్నాయి. మధ్యలో ఆ కేకలు చీల్చుకుంటూ ఒక ఆడగొంతు కీచుమంది.

"ఇంటున్నారా బాబూ! నా కొడుకుని...." అంటూ కోటయ్య గబగబా గుంపులో దూరాడు. గురుమూర్తి కూడా గుంపు దగ్గరకు చేరుకున్నాడు. గురుమూర్తిని చూడగానే జనం 'ప్లీడర్‌గారు వచ్చారు' అంటూ పక్కకి తప్పుకుని దోవ యిచ్చారు. గురుమూర్తి తిరపతి గుడిసె ముందు నిలబడ్డాడు. అక్కడి దృశ్యం



అల్యూమినియం పాత్రలను వాడే కొద్దీ వాటి కాంతి తగ్గిపోయి, నల్లబడతాయి. ఇలా నల్లబడడాన్ని తగ్గించడానికి వాటిని పీలైనవ్వుడల్లా పొడిగా ఉండే టేబుల్‌సాల్టుతో పాలిష్ చెయ్యాలి.

వర్ణించ నలవికాకుండా వుంది. తిరపతి చేతిలో ఒక పక్క కాలుతున్న ఒక పెద్ద లావుపాటి కట్టెపుల్ల పట్టుకుని నుంచున్నాడు. జనం అతణ్ణి విడిపించి బైటికి తీసుకు రావాలని చాలా ప్రయత్నించారు–కాని, అప్పుడున్న వేడిలో బైటికి రాకుండా వాళ్ళను విదిలించేశాడు – ఇక రెండో వైపున కొంచెం దూరంలో తిరపతి భార్య అప్పలనరిసి చేతిలో కొడవలి పట్టుకుని వుంది. చీర పైకి ఎగ కట్టుకుని వుంది. మొహం కందగడ్డ లాగ ఎర్రగా వుంది-జుట్టు విర బోసుకుంది. కాళికాదేవి లాగ భయంకర రూపం దాల్చి వుంది. ఇద్దరి వంటి మీదా గాయాలున్నాయి. తిరపతి భుజం మీది రక్తం కారుతూంది. వాళ్ళిద్దరూ గురుమూర్తిని గమనించలేదు. నోటి కొచ్చిన కూతలు కూసుకుంటున్నారు–అంతలో గుమ్మంలో నుంచున్న గురుమూర్తిని గమనించిన అప్పలనరిసి కొరకొరా గురుమూర్తిని చూసుకుంటూ లోపలికి వెళ్ళింది. అయినా నోరు మూతబడలేదు. నోరు విప్పకుండా తిరపతి అక్కడే నుంచున్నాడు. వాళ్ళిద్దరికీ యెప్పుడు పోట్లాట వచ్చినా కోటయ్యను గురించే! ఏఁవైనా తండ్రికదా అని–అతన్ని తమ వద్ద వుంచుకుందామంటాడు తిరపతి. ససేమిరా వీల్లేదంటుంది అప్పలనరిసి-ఆ ముసలాడు తమ వద్ద వుండడం ఆమెకిష్టం లేదు. తండ్రిమీది ప్రేమ కొద్దీ ఎప్పుడైనా ఆ పేరు ఎత్తితేచాలు-ఆ రోజు యిల్లూ వాకిలీ ఏకం చేసి కూడువండదు. ఏం చేస్తాడు? గయ్యాళి భార్య. ఎంతమంచిగా చెప్పినా వినే తత్వంకాదు అప్పలనరిసిది-తండ్రిని గురించి అప్పుడప్పుడు బాధపడతాడు తిరపతి. ఆ దృశ్యాన్నంతా చూసిన గురుమూర్తి "తిరపతీ!" అని గట్టిగా కేకవేశాడు. తిరపతి ఉలిక్కిపడి బైటికొచ్చాడు.

"ఏఁవిట్రా యిదంతా? ఏం జరిగింది?" అడిగాడు.

"ఏఁవుందండయ్యా! ఎప్పుడు తగాదా వచ్చినా మా అయ్య గురించేనండి! మా అయ్య పేరెత్తసిదండి! ఆరోజు కూడుండదు–అయ్య యెల్లినకాణ్ణుంచి నా మనసేం బాగాలేదండి. ఎంతైనా కన్న తండ్రికదాండీ! 'మా అయ్యరిచ్చాబండి మా అయ్యకిచ్చేసి మనం కొత్తది కొనుక్కుందాం.' అన్నానండీ! అంతే, దానికేనండి యింత రాద్ధాంతం – ఏదో మీరు కాపాడుతున్నారు కాబట్టి బతుకుతున్నాడు-లేకుంటే ఆ ముసలాడిగతి ఏందిసెప్పండి? ఇయ్యాల ఆరిచ్చా గురించేనండి యీ పోట్టాట–ఏఁవైనా బండి యిచ్చేత్తానన్నానండి–ఆ మాటకి, 'అబ్బా కొడుకులు నాకు తెలీకుండ కలుస్తున్నారన్నమాట. అందుకే యింత పేఁవ పుట్టుకొచ్చింది. ఇయ్యాల రిచ్చా యిత్తానంటావు – రేపు యీ పూరిగుడిసె యిచ్చేసి, సెట్టుకింద వుందాఁవంటావు-మీరంతా ఒకటే, నేనే పరాయిదాన్ని' అంటూ పెద్ద గొడవ సేసిందండి. దాంతో నాకు కోపం రెచ్చిపోయిందండీ, పట్టలేక రెండేశానండి – వూరుకోక పెద్ద గోల మొదలెట్టిందండి-ఆ గోల యీవరకొచ్చిందండి .... అయినా మా అయ్య మొత్తుకుంటూనే వుండేవాడండి ఆడదాన్ని నెత్తికెక్కించు


కోకురా అని – నేను యిన్లేదండి. ఊరునాడ ఏకి(వయ్యాకి తెలిసొచ్చిందండి-ఇది యియ్యాలతో పోదండి!'' అంటూ లోపలికి పోయాడు తిరపతి. అతనితోపాటు అక్కడి జనంకూడా కొంతమంది లోపలికి వెళ్ళారు మళ్ళీ ఏం జరుగుతుందోనని– అది గమనించిన గురుమూర్తి వెంటనే తిరపతిని బైటికిపిలిచి, "చూడు తిరపతీ! ఇప్పుడు మళ్ళీ మీరిద్దరూ పోట్లాడుకున్నా, కొట్టుకున్నా వెంటనే పోలీసుల్ని పిలిపించి జైల్లో పెట్టిస్తాను-తెలిసిందా?" అని బెదిరించాడు గురుమూర్తి–వెంటనే తిరపతి, "బాబుగారూ! పోట్టాట్టం నాకు సరదాండీ, ఇన్నాళ్ళూ యెంతో ఓర్పానండి–ఇయ్యాల మరీ రెచ్చిపోయిందండి. మా అయ్యను అనరాని మాటలంటూంటే వూరుకోలేక పొయ్యాను–'' అని తన బాధను వివరించాడు. గురుమూర్తి తిరపతి బాధను అర్ధం చేసుకున్నాడు–వెంటనే అప్పలనరిసిని కూడా పిలిచి, చివాట్లుపెట్టి తను యింటికి వెళ్ళిపోయాడు. జనం కూడా ఎక్కడి వాళ్ళక్కడ సర్దుకున్నారు–ఆ సందు వానకురిసి వెలిసినట్టయింది. వాళ్ళ కక్షలే(విటో, ఆపేక్ష లే(విటో గురుమూర్తికి అర్ధం కాలేదు.

ఇల్లు చేరగానే శారద అడిగింది, "ఏ(వైందండీ? చాలామంది జనం మూగారటగా? తిరపతి ఎలావున్నాడు? బాగా దెబ్బలు తగిలాయా?'' అని ఆత్రంగా.

"వాళ్ళ కక్షలకీ, ఆపేక్షలకీ గల అంతరార్ధం ఏ(విటో అర్ధం కావడంలేదు శారదా! అయినా తండ్రిని ముందు బైటికి వెళ్ళగొట్టాడు–వెళ్ళి పోయాక తండ్రిమీద ఎక్కడలేని ప్రేమ, దయా పుట్టుకొచ్చాయి. ఒకళ్ళకొకళ్ళు దూరమైనకొద్దీ ప్రేమలు పెరుగుతాయి కాబోలు!'' అని గురుమూర్తి అక్కడ జరిగింది, తాను చూసిందీ అంతా వివరించాడు.

*

అదే రోజు రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో గురుమూర్తి క్లబ్బుకు వెళ్ళి తిరిగి వస్తూ, తిరపతి ఇంటి వెనక కొంచెం దూరంలో చింత చెట్టు కింద కారు ఆపి, ఇంటి పక్క గోడ దగ్గరకు వచ్చాడు వాళ్ళ పరిస్థితి ఎలా వుందో చూడాలనుకుని. గది కిటికీలోంచి దీపం వెలుతురు కనిపించింది. బైటంతా చీకటిగావుంది. రోడ్డు లైటు కూడా లేదు. తాను ఎవ్వరికీ కనబడ కుండా నీడలో నుంచుని గదిలోకి చూశాడు.



ఉప్పు–నీరు కారిపోకుండా ఉండడానికి ఉప్పు ఉంచిన పాత్రలో కొన్ని బియ్యపు గింజలు వేసి పెడితే చాలు!

లాంతరు ఎత్తుగా ముక్కాలు పీట మీద పెట్టి వుంది. దీపం దగ్గరగా అప్పలనరిసి కాళ్ళు బార జాపుకుని కూర్చొని వుంది. ఆమె ఒళ్ళో తిరపతి తల పెట్టుకుని పడుకుని వున్నాడు. ఆ దృశ్యం చూస్తే వాళ్ళసలు పోట్లాడుకున్నారా అని అనిపిస్తుంది. గురుమూర్తికి చాలా ఆశ్చర్యం వేసింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. అప్పలనరిసి తిరపతికి తగిలిన దెబ్బలకు ఏదో మందు రాస్తున్నది. తిరపతి కళ్ళు మూసుకుని మైమరచి మందు రాయించుకుంటున్నాడు. గురుమూర్తి దృష్టి అప్పలనరిసి మొహం మీద పడింది. ఆ వుదయం చూసిన అప్పలనరిసికి, అప్పుడు చూస్తున్న అప్పలనరిసికి వున్న తేడాని కొలవలేకపోయాడు. ఆ రౌద్ర రూపం, ఆ క్రోధ పూరితమైన చూపులు, కందగడ్డలాంటి ఎర్రని మొహం, ఎటు మాయమయాయో తెలియలేదు. చక్కగా తల దువ్వుకొని, ముడి వేసుకొని, తల్లో మల్లెపూలు ముడుచుకుని, నుదుట కుంకుమ దిద్దుకుని, కళ్ళ నిండా కాటుక పెట్టుకుని వుంది. మొహంలో చిరునవ్వు చిందులాడుతూ, స్త్రీకి వుండ వలసిన సహజమైన మమత, ప్రేమ అప్పల నరిసిలో ఉట్టిపడుతూ వుంది – అప్పలనరిసి 'అప్సరస'గా మారిందా? అనిపించింది గురు మూర్తికి. ఆ దృశ్యం నిజంగా గురుమూర్తిని చకితుణ్ణి చేసింది. ఎంతో ఆనందంగా యింటికి తిరిగి వచ్చాడు. వస్తూనే "శారదా! ఇలా రా! నీకో శుభవార్త చెబుతాను!'' అని తాను చూసిన దృశ్యాన్ని వర్ణించి చెప్పాడు. శారద అలాగే వింటూ నిశ్చేష్టురాలైంది.

"ఎవరనగలరు శారదా ఆ దంపతుల జీవితం సుఖమయం కాదని?'' అని, "వాళ్ళు బజారెక్కి పోట్లాడుకున్నా మళ్ళా మర్చిపోతారు. అదే మనలో అంటే చదువుకున్న వాళ్ళల్లో, డబ్బుగల వాళ్ళల్లో, అయితే కాస్త పోట్లాటకు, కక్షలు పెంచుకుని, సంవత్సరాల తరబడి మాటలు మానేసి, ఆ యింటి మీద కాకి, ఈ యింటి మీద వాలకూడదని శాసిస్తాము. కక్షలకీ, ఆపేక్షలకీ చదువూ అంతస్తులతో పనిలేదు. సంస్కారం కావాలి శారదా! సంస్కారానికి జాతిమత భేదాలు లేవు. ఆస్తి, అంతస్తులతో సంబంధం లేదు. అర్ధ(మైందా శారదా?'' అంతా విని శారద, "మీరు చెప్పిం దంతా బాగానే వుంది. అయితే మరి అప్పల నరిసిలో అంతస్తు, చదువు, సంస్కారం ఏవీ లేవు. చదువు, అంతస్తు, జాతి వీటిల్లో ఏది వున్నా, అలా బజారెక్కేదా? మొగుణ్ణి కొట్టేదా? మా(వని వెళ్ళగొట్టేదా?'' అంది.



కంచు పాత్రలను తళతళా మెరిసేలా చెయ్య డానికి వాటిని నిమ్మరసం కలిపిన 'బ్రాసో'తో పాలిష్ చెయ్యాలి. ఇలా చేస్తే అవి ఎక్కువ కాలం శుభ్రంగా ఉంటాయి.

"నువ్వన్నట్టు ఆమెలో ఏ(వీలేవు. అయితే ఆమెలో సంస్కారం ఆవగింజంత వుంది కాబట్టే తన తప్పు తాను తెలుసుకుని సాయంత్రానికే భర్తను ఆదరించింది. మనలో అయితే చదువు, అంతస్తూ వున్నా కూడా అలా పోట్లాటరాగానే భార్య పుట్టింటికి వెళ్ళిపోవడమో, లేకపోతే మరెక్కడికైనా వెళ్ళి పోవడమో, లేకుంటే మూడు రోజులు ముసుగు తన్ని పడుకోవడమో–ఇవేవీ కాకపోతే పుట్టింటి వాళ్ళచేత మొగుణ్ణి చివాట్లు పెట్టించడమో జరుగు తుంది. అప్పలనరిసిలో ఆవగింజంతైనా సంస్కారం వుంది కాబట్టే, పొద్దుట జరిగిందంతా మర్చిపోయి, భర్తను ప్రేమతో తనవాణ్ణి చేసు కుంది.'' అని గురుమూర్తి అనగానే శారద, "పోనీలెండి వాళ్ళ జీవితం కలకాలం అలా వుండాలనే కోరుకుందాం.'' అంది – అదే తన ఆశీస్సుగా. □